# సర్టిఫికెట్

నీలలోహితం వృద్ధాప్యంలో పడ్డాడు. ఏభై ఎనిమిదో ఏట అడుగుపెట్టి ఆరునెలలైంది. తను రైల్వేలో చేరిన ముప్పయి ఐదేళ్ళ సర్వీసులోను, క్లాస్‌ఫోర్ ఉద్యోగంలో ప్రవేశించి అనేక శ్రమదమాదులకోర్చి ప్రైవేటుగా మెట్రిక్ పాసయి క్లాస్ త్రీలోకి ప్రమోటయ్యాడు. ఐతే రైలుబండి పట్టాలపై నడిచినంత సాఫీగా మాత్రం తన జీవితం నడవలేదు. అది గతుకుల రోడ్డుమీదే ప్రయాణించింది.

ఓ ఆరునెలల్లో రిటైరవుతాడనగా అన్ని పింఛను కాగితాలు పూర్తిచేసి రైల్వే అధికార్లకు దాఖలు చేసుకున్నాడు. తను రిటైరయ్యే తేదీనాటికి సుమారు ఏనభైవేలు అందుతాయి. తనుంటున్న క్వార్టర్ ఖాళీ చేయాలి. ఇది వరకు తాను కొనుక్కున్న చిన్న జాగాలో కనీసం ఓ పూరిపాక వేసుకుని భార్యతో సతీ సహజీవనం చెయ్యాలి. తనకు మొదట కొడుకు, తరువాత కూతురు పుట్టగానే ఎర్రత్రికోణం అమలు చేసేసాడు. కూతురికి పెళ్ళిచేసి కాపురానికి పంపించేసాడు. అంతవరకూ సజావుగానే సాగిపోతోంది.

ఐతే ఇటీవలే ఓ ఆకాశరామన్న రైల్వే అధికారులకి ఓ ఉత్తరం వ్రాసి పారేసాడు.

"నీలలోహితం కొడుకు నలభై ఐదేళ్ళవాడు కూడా రైల్వేలో క్లాస్‌ఫోర్‌లో పని చేస్తున్నాడు అంటే నీలలోహితం తన పదమూడవ ఏటనే కొడుకుని కనేసాడా? దర్యాప్తు చేసి తగిన చర్య తీసుకోవలసింది" అని ఆ లేఖలోని సారాంశం.

అప్పట్లో ఎస్సెస్సెల్సీ పోయినవాళ్ళెవరైనా క్లాస్‌ఫోర్ రైల్వే ఉద్యోగంలో

చేరినప్పుడు పుట్టిన తేదీ ఏది వ్రాస్తే అదే ఆమోదించేవారు. ఎస్సెస్సెల్సీ పాసైనవాళ్లు చేరితే మాత్రం సర్టిఫికెట్ వున్న పుట్టిన తేదీయే నమోదు చేసేవారు. నీలలోహితం ఎస్సెస్సెల్సీ పరీక్ష తప్పేక క్లాస్‌ఫోర్ ఉద్యోగంలో చేరాడు. అప్పుడతను తన తల్లిదండ్రులు చెప్పుకునే జన్మించిన తేదీ ఏదో వేసేశాడు.

"నువ్వు పుట్టిన తేదీ విషయంలో దొంగ సర్టిఫికెట్ సృష్టించి ప్రభుత్వాన్ని మోసం చేసావ్. నీ మీద క్రమశిక్షణా చర్య ఎందుకు తీసుకోకూడదో ఈ నోటీసు అందిన పదిహేను రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వవలసింది" అని శ్రీముఖం అందజేసారు రైల్వే అధికారులు.

నీలలోహితం బిక్కచచ్చిపోయాడు!

"ఇదేమిట్రా భగవంతుడా రిటైరయ్యేముందు ఈ గొడవేమిటి" అని తీవ్రమైన మానసిక క్షోభకు గురి అయ్యాడు. తన మిత్రుడైన ఒక లాయర్‌ని సంప్రదించి కోర్టులో ఛాలెంజ్ చేసాడు ప్రభుత్వపు నోటీసుని.

కేసు పరిష్కారమయ్యేవరకూ పిటిషనరైన నీలలోహితం మీద ఎట్టి క్రమశిక్షణా చర్య తీసుకోవడానికి వీల్లేదని స్టే మంజూరు చేసిందికోర్టు.

కేసు విచారణ చెయ్యవలసిన రోజు వచ్చింది.

ప్రభుత్వ న్యాయవాది నీలలోహితాన్ని క్రాస్ పరీక్ష చేయడం మొదలెట్టాడు.

అంతకుముందే నీలలోహితం తన ప్లీడరు ఇచ్చిన రిహార్సలు ప్రకారం సమాధానాలకు సిద్ధపడ్డాడు.

"ఇది మీ జన్మదినం ధ్రువపరిచే సర్టిఫికెట్ ఔనా?" ప్రశ్నించాడు ప్రభుత్వ న్యాయవాది నీలలోహితం సర్వీసు రిజిస్టరు చూపిస్తూ,

"ఔనండి ఇది నాదే" అన్నాడు నీలలోహితం.

"ఇది మీ కుమారుడు పుట్టిన తేదీ ఖరారు చేసే సర్టిఫికెట్ అవునా?"

"ఔను" అన్నాడు నీలలోహితం.

"ఐతే మీ కుమారుడు మీకు మీ పదమూడవ ఏటే జన్మించినట్లయింది!"

కోర్టు హాలు నవ్వులతో దద్దరిల్లింది.

"ఆర్డర్ ఆర్డర్!" హెచ్చరించాడు న్యాయమూర్తి.

"పదమూడవ ఏటే మీరు తండ్రి అయ్యారంటే గిన్నీస్ బుక్‌లోకి ఎక్కవలసిన విషయమే".

మళ్ళీకోర్టు హాలు నవ్వులతో హోరెత్తింది.

నిశ్శబ్దం ఆవహించాక నీలలోహితం చెప్పాడు.

"నేను నా భార్యను వివాహం చేసుకునే నాటికి ఆమెకు పదమూడేళ్ళ కుమారుడున్నాడు. వాడు ఆమె మొదటి భర్తవల్ల పుట్టిన అబ్బాయి. నేను వితంతు వివాహం చేసుకున్నానని కోర్టువారికి మనవి చేసుకుంటున్నాను!"

ఈ జవాబుకి కోర్టు హాలంతా స్తబ్ధమైంది. అతని భార్యని, కుమారుడ్ని కూడా బోను ఎక్కించారు. వాళ్ళు కూడా అదే సమాధానం చెప్పారు.

న్యాయమూర్తి తీర్పుని వాయిదా వేసారు.

పదిరోజులు పోయాక న్యాయమూర్తి తన తీర్పుని ప్రకటించారు.

"పిటిషనరైన నీలలోహితం వితంతు వివాహం చేసుకున్నట్లు రుజువైంది. అతనికి వ్యతిరేకంగా దాఖలైన కేసును కొట్టి వేయడమే కాక సంఘ సంస్కర్తలైన కందుకూరి, గురజాడ అడుగుజాడల్లో నడిచినందుకు అతనిని అభినందిస్తున్నాను"

ఇప్పుడు కోర్టు హాలు చప్పట్లతో మార్మోగింది!.

• ఆదివారం ఆంధ్రభూమి •

*24–3–1991*